# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నగదుతో పాటు అన్నదాత సుఖీభవ నగదును రైతుల ఖాతాల్లో జమ చేయనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **వైయస్సార్ కడప జిల్లాలోని గండికోటలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభిస్తారు.**
3. **రాష్ట్రంలో 6 వేల వంద పోలీసు కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించిన తుది ఫలితాలను హెూంశాఖ మంత్రి వి.అనిత ఈ రోజు విడుదల చేశారు.**
4. **ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు.**
5. **రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజక వర్గాలలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**

==========================

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఇచ్చే నగదుతో కలిపి అన్నదాత సుఖీభవ కింద 20వేల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్య మంత్రి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర మంత్రులు, శాసనభ్యులు, పార్లమెంట్ సభ్యులు ఎమ్మెల్సీలతో శ్రవణ మాధ్యమం విధానంలో ముఖ్యమంత్రి ఈరోజు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఈనెలలో అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. త్వరలో నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నామని తెలిపారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు వైయస్సార్ కడప జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా జమ్మలమడుగులో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు నగదును అందజేస్తారు. చేనేత కార్మికులతో సమావేశమవుతారు. ప్రజా వేదికలో పి4 బంగారు కుటుంబాలతో ముఖాముఖిలో పాల్గొంటారు.

సాయంత్రం గండికోట పర్యాటక ప్రాజెక్టును ప్రారంభించి.. అనంతరం 165 కోట్ల రూపాయలతో

చేపడుతోన్న 5 ప్రాజెక్టులకు దృశ్య మాధ్యమం ద్వారా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు.

-----------------------------

రాష్ట్రంలో 6 వేల వంద పోలీసు కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించిన తుది ఫలితాలను హెూంశాఖ మంత్రి వి.అనిత ఈ రోజు విడుదల చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఆర్.కె.మీనా, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో కలిసి మంత్రి ఫలితలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

వాయిస్ 27 సెకన్లు

-----------------------------

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కొత్తగా లక్షా 9వేల మందికి స్పౌజ్ పింఛన్లు అందిస్తున్నామన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

-----------------------------

రాష్ట్రంలో ఈనెల 15 నుంచి మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని రవాణా శాఖమంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో మంత్రి ఈ రోజు సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత బస్సు పథకం అమలు కోసం ఇప్పటికే 1400 కొత్త బస్సులు ప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. మరో 1500 విద్యుత్ బస్సుల కొనుగోలుకు టెండర్లు పిలవనున్నామన్నారు. మహిళా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్టాండ్లలో సౌకర్యాలు మెరుగు పరుస్తున్నామని మంత్రి వివరించారు.

-----------------------------

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లిలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో పాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.

-----------------------------

రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజక వర్గాలలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎన్ టి ఆర్ భరోసా పింఛన్లు పంపిణీలో బాగంగా శ్రీకాకుళం జిల్లా పాత్రునివలస గ్రామంలో లబ్ధిదారులకు మంత్రి ఈ రోజు పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం

ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎం ఎస్ ఎం పార్కుల ద్వారా గ్రామీణ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్.. 26 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహక – ఈఎల్ఐ పథకం పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన– పీఎం–వీబీఆర్‌వై ఈరోజు నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిందని ప్రాంతీయ భవిష్య నిధి కమీషనర్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. విజయవాడలో ఆయన మాట్లాడుతూ, నూతన ఉద్యోగాలను కల్పించేందుకు యజమానులకు ఈ పథకం ప్రోత్సాహకాలు అందిస్తుందని చెప్పారు. తయారీ రంగంతో పాటు మిగిలిన రంగాల్లోనూ కొత్త ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని తెలుపుతూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

స్వాతంత్ర్యోద్యమ కాలంలో తన ప్రసంగాలతో యువతలో స్ఫూర్తి రగిలించిన లోక మాన్య బాల గంగాధర తిలక్ వర్ధంతి ఈ రోజు. 1856 సంవత్సరం జులై 23వ తేదీన బొంబాయి సమీపంలోని రత్నగిరి పట్టణంలో జన్మించిన ఆయన... స్వరాజ్య సాధన దిశగా ప్రజలను ముందుకు నడిపించారు. "స్వరాజ్యం నా జన్మ హక్కు" అని నినదించి... దానిని ఎప్పటికైనా సాధించి తీరుతామంటూ స్వాతంత్ర్యోద్య మాన్ని కొత్త పుంతలు తొక్కించారు. సంపూర్ణ స్వరాజ్య ఉద్యమానికి పితామహుడిగా నిలిచిన బాల గంగాధర తిలక్ 1920వ సంవత్సరం ఆగస్టు 1వ తేదీన తుది శ్వాస విడిచారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 316 పాయింట్ల నష్టంతో 80 వేల 866 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 125 పాయింట్ల నష్టంతో 24 వేల 642 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మీ తెలియజేస్తూ....

వాయిస్...18 సెకన్లు

=====================